సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఘనంగా పుష్పాంజలి సేవ

శ్రీ కేశవస్వామివారి పుష్పాంజలి సేవను సోమవారం కనులపండువగా నిర్వహించారు. 8లో



అర్జీలకు సత్వర పరిష్కారం

స్పందనలో స్వీకరించే దరఖాస్తులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. 8లో



తాండవలో సినిమా షూటింగ్

కొత్తగా రూపొందించే సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను సోమవారం తాండవ రిజర్వాయర్‌వద్ద చిత్రీకరించారు. 8లో

పెత్తందార్లతో యుద్ధానికి సిద్ధం

- వైఎస్సార్‌సీపీకి ప్రజలతోనే పొత్తు
- ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు మనకే ఉంది
- పచ్చమీడియా, చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలి
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి
- అడ్డురోడ్డు, అనకాపల్లిల్లో భారీ ఎత్తున సిద్ధం సభలు



అడ్డురోడ్డులో జరిగిన సిద్ధం సభలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి వేదికపై మంత్రి అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్లబాబూరావు, పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



అనకాపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్,ఎంపీ బీవీ.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్



అనకాపల్లిలో సిద్ధం సభకు తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

నక్కపల్లి/ఎస్.రాయవరం/ తుమ్మపాల: పెత్తందార్లతో యుద్ధానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. జిల్లాలోని అనకాపల్లి, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డుల్లో సోమవారం నిర్వహించిన 'సిద్ధం' సభల్లో ఆయన మాట్లాడారు. అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అధ్యక్షతన పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో, అనకాపల్లి పట్టణంలోని రావుగోపాలరావు కళాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ ఆధ్వర్యంలో అనకాపల్లి నియోజకవర్గ స్థాయిలో సిద్ధం సభలు భారీ ఎత్తున నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తన తోక పార్టీ జనసేన, పచ్చమీడియాతో కలసి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. వీటిని మనమంతా తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. సింహం సింగిల్‌గానే వస్తుందన్నట్టు జగన్‌మోహన్‌రెడ్డి ఏ పార్టీతోను పొత్తు పెట్టుకోకుండా నేరుగా ప్రజల మద్దతుతోనే ఎన్నికల బరిలోకి దిగుతున్నారని తెలిపారు. 'ఐదేళ్లలో నవరత్నాలను అమలు చేసి మీ అందరికీ మంచి చేశానని అనిపిస్తేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేయాలని' సీఎం జగన్‌మోహన్ రెడ్డి కోరుతున్నారని, ఇటువంటి ధైర్యం, దమ్మున్న నాయకుడు ఆయన ఒక్కరేనన్నారు. అవినీతికి తావులేకుండా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం మనదేనని చెప్పారు. ఏడాదిన్నరనుంచి ఎమ్మెల్యేలను ప్రజల్లోనే ఉండాలని ఆదేశించిన గట్స్ ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నేడు ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే సత్తా వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. దుష్ట చతుష్టయం, టీడీపీ, జనసేన పార్టీలు మళ్లీ మోసం చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించి అధికారంలోకి రావడానికి వస్తున్నాయన్నారు. వీరి కుట్రలను, గత ఎన్నికల ముందు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మళ్లీ మోసపోవద్దని తెలియజేస్తూ మరోసారి జగనన్న ఎందుకు ముఖ్యమంత్రి కావాలో వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి కంబాల జోగులును, అనకాపల్లి నియోజకవర్గం నుంచి మలసాల భరత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అంటే జగన్ మోహన్‌రెడ్డికి అత్యంత ఇష్టమని, అమర్‌నాథ్‌కు డిప్యూటీ పదవి ఇచ్చి అభ్యర్థులను గెలిపించే బాధ్యత అప్పగించారన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదేనని చెప్పారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక చంద్రబాబునాయుడు పొత్తు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ 30 ఏళ్లలో దళితుడనే వాడు ఏ నాడూ రాజ్యసభకు వెళ్లలేదన్నారు. చంద్రబాబునాయుడు వర్ల రామయ్యకు రాజ్యసభ ఇస్తానని ఆశపెట్టి మోసం చేశాడని చెప్పారు. జగనన్న అలా కాదని, ఇచ్చిన మాటకు కట్టుబడి, విశ్వాసపాత్రునిగా ఉన్న తనను రాజ్యసభకు పంపించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు దమ్ముంటే టీడీపీ నాయకులు రావాలని సవాల్ విసిరారు. మా అందరి ఎజెండా జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో సీఎంను చేసుకోవడమేనన్నారు. పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ జగనన్న దయవల్ల తాను రాజాంలో రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యానని, పాయకరావుపేటలోనూ మీ అండదండలతో ఎమ్మెల్యేగా గెలుస్తానన్న నమ్మకం ఉందన్నారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ మాట్లాడుతూ తనను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించానని, సంక్షేమ పథకాలతో ప్రజల కళ్లల్లో ఆనందం చూశానన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షాలన్నీ ఏకమై ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. అడ్డురోడ్డులో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎస్.రాయవరం మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, ఎంపీపీలు కోన లోవలక్ష్మి, ఏనుగుపల్లి రత్నం, ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీలు గోసల కాసులమ్మ, కాకర దేవి, లంక సూరిబాబు, సిద్ధాబత్తుల దేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి చంటి, వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీతబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు పైలా రమేష్, పార్టీ సీనియర్ నాయకులు భీశెట్టి విష్ణుమూర్తి, దగ్గుపల్లి సాయిబాబా, దనిశెట్టి బాబూరావు, కొణతాల శ్రీను, లొడగల చంద్రరావు, వీసం నానాజీ, మణిరాజు, పాపారావు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవింద్, మహిళా నేతలు శేషారత్నం, శ్రీదేవి, సుందరలత, శారదాకుమారి, అనకాపల్లిలో జరిగిన సభలో పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కార్పొరేటర్లు కొణతాల నీలిమ, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్ అధిక సంఖ్యలో సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అడ్డురోడ్డులో సిద్ధం సభకు హాజరైన పార్టీ శ్రేణులు

ఇంట్లో ఫ్యాన్.. సింక్‌లో గ్లాస్

ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ దళిత నేతను రాజ్యసభకు పంపించడం ద్వారా గొల్ల బాబూరావుకు సముచిత స్థానం కల్పించిన ఘనత జగనన్నదేనన్నారు. జగనన్న తాను చేసిన అభివృద్ధి చూసి ఓటు అడుగుతుంటే చంద్రబాబు పొత్తులు చూసి ఓటేయండని అడుక్కుంటున్నారన్నారు. పప్పుగారి ఎర్రబుక్ మడిచి లోపల పెట్టుకోవాల్సిందేనన్నారు. రానున్న ఎన్నికలు పెత్తందారులకు, పేదవాడికి మధ్య జరిగే యుద్ధమని, ఈ యుద్ధంలో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన నిలవాలని కోరారు. ఫ్యాన్ ఇంట్లో ఉండాలి, గ్లాస్ సింక్‌లో ఉండాలి, అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయ్యాలని కోరారు.

యలమంచిలి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- రూ.13.13 కోట్లతో ఆధునికీకరణ పనులు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- జిల్లాలో నిర్మాణ పనులు పూర్తయిన 8 ఆర్‌యూబీలు ప్రజలకు అంకితం
- విశాఖ కేంద్రంగా రైల్వేజోన్.పలు రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కన్నబాబు వినతి



శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. దీనిలో భాగంగా యలమంచిలి రైల్వేస్టేషన్‌లో రూ.13.13 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రధాని తన కార్యాలయం నుంచి సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు(కన్నబాబు రాజు) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్న కృతనిశ్చయంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లను ఆధునికీకరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. పార్లమెంట్‌లో విశాఖ రైల్వేజోన్‌పై ప్రకటన చేసినా కార్యరూపం దాల్చకపోవడంతో అది కలగా మిగిలిపోతుందేమోనన్న ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ విషయాల్లో స్థానిక బీజేపీ నాయకులు పట్టుబట్టి ప్రజలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. యలమంచిలి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరిచేందుకు రూ.13.13 కోట్లతో వివిధ అభివృద్ధిపనులు చేపట్టడం హర్షణీయమని చెప్పారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.2.20 కోట్లతో సీసీ రోడ్డు పనులు కొత్తగా జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నం, విజయవాడల మధ్య తిరిగే రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు, భువనేశ్వర్‌ల మధ్య తిరిగే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్, హౌరా మధ్య ప్రయాణించే చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యలమంచిలి స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని కన్నబాబు కోరారు. ఈ మేరకు విజయవాడ రైల్వే డివిజినల్ మేనేజర్‌కు రాసిన వినతిపత్రాన్ని ఇక్కడ అధికారులకు ఇచ్చారు.అట్టహాసంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ ప్రైవేటు స్కూళ్లకు చెందిన విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా చేపట్టిన శంకుస్థాపన, ప్రజలకు అంకితం చేసే కార్యక్రమాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పలచలపతిరావు, జెడ్ఆర్‌సీ సభ్యుడు బోడపాటి శ్రీను, బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, కోఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, రైల్వే అధికారులు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 ఆర్‌యూబీలు ప్రజలకు అంకితం


తుని,అనకాపల్లి మధ్య ప్రజల డిమాండ్ల మేరకు 8 లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద నిర్మించిన అండర్ పాస్‌లను కూడా సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రజలకు అంకితంచేశారు. ములకలాపల్లి, తురంగలపాలెం, నామవరం(ఎల్సీ నంబరు.462), నామవరం(ఎల్సీగేటు నంబరు462/ఎ), పెదబోదుగాలెం వద్ద రెండు, గుల్లిపాడు, నామవరం రైల్వే గేట్లవద్ద అండర్ పాస్‌లను ప్రారంభించారు. యలమంచిలి మండలంలోని ములకలాపల్లి, తురంగలపాలెం లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద నిర్మించిన ఆర్‌యూబీల ప్రారంభోత్సవాలను రైల్వే అధికారులు పండగ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన ప్రజలకు పసందైన విందు ఏర్పాటుచేశారు.



యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రధాని మోదీ ప్రసంగాన్ని తిలకిస్తున్న ప్రజలు

న్యూస్‌రీల్

నల్లధనం, మద్యంపై నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: త్వరలో జరగనున్న ఎన్నికల్లో నల్ల ధనం, అక్రమ మద్యం అరికట్టడానికి పక్కాగా నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నగదు తరలింపుపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రకటన తేదీ నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా భారీ మొత్తంలో నగదు, మద్యం గమనించినట్టయితే, అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రూ.10 లక్షలకు మించి నగదును గుర్తిస్తే ఆదాయపు పన్నుశాఖకు పంపించాలన్నారు. ఈ సమీక్షలో కేంద్ర ఐటీశాఖ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎన్.టి.ఆర్. బాబ్జీ, జిల్లా ఎక్సైజ్ సూరింటెండెంట్ ఎం.సునీత, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డీటీ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం విద్యారుణం

8లో

ఛ్ఛ్.. ఏం చేద్దాం!

- అధినేతను కలిసినా లభించని హామీ
- ఆశ వదులుకోవాల్సిందేనని బాబ్జీకి సిగ్నల్
- చీపురుపల్లికి చలో అనాల్సిందేనని గంటాకు స్పష్టీకరణ
- భీమిలి నుంచి సీటు కావాలని గంటా వేడుకోలు
- అనకాపల్లి విషయంలోనూ పీలాకు అదే తీరే..
- బాబు తీరుపై మండిపడుతున్న నేతలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అధినేతతో సమావేశం తర్వాత హామీ లభిస్తుందనుకున్న టీడీపీ నేతలకు భంగపాటు ఎదురైంది. విశాఖ దక్షిణం, అనకాపల్లి, భీమిలి సీట్ల విషయంలో అధినేతను కలిసిన ముగ్గురు నేతలకు ఎటువంటి హామీ లభించలేదు. విశాఖ దక్షిణం సీటును ఆశించి క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్న గండి బాబ్జీ సీటుకు గండిపడినట్టేనని తేలిపోయింది. ఇక అనకాపల్లి సీటు విషయంలో పీలా గోవింద్ ఆశలు వదులుకోవల్సిందేనని స్పష్టమైంది. గంటా శ్రీనివాసరావు చలో చీపురుపల్లి అనాల్సిందేనని చంద్రబాబు తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. అధినేతను కలిసిన తర్వాత హామీ వస్తుందనుకున్న నేతలకు ఊరడింపు మాటలు మినహా సీటు ఊసెత్తకపోవడంతో ఊసురోమనుకుంటూ తిరుగుపయనమైనట్టు తెలుస్తోంది. తెలుగుదేశం-జనసేన సీట్ల ప్రకటనల అనంతరం అసమ్మతి నేతలకు స్పష్టమైన హామీ లభించకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్‌పై ఎవరికివారుగా తమ అనుచరులతో భేటీ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

దక్షిణ ఆశలకు గండి

గత ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ తరుపున గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ ఆ పార్టీ తీరు నచ్చకపోవడంతో దూరంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన తీరును మెచ్చుకుంటూ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటున్నారు. వాసుపల్లి దూరమైన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి తెలుగుదేశం పార్టీలో నెలకొంది. కొన్నాళ్లకు గండి బాబ్జీని నియోజకవర్గ ఇన్‌చార్జిగా తీసుకువచ్చారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో గండి బాబ్జీ పర్యటిస్తూ వచ్చారు. ఇందుకోసం బాగానే ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో దక్షిణం నుంచి సీటు వస్తుందని మొన్నటివరకూ ఆశించారు. అయితే, పొత్తులో భాగంగా భీమిలితో పాటు విశాఖ దక్షిణ సీటును జనసేనకు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన గండి బాబ్జీ ముందుగానే పార్టీ పెద్దలను కలసి సీటు కోసం ప్రయత్నించారు. ఆదివారం విజయవాడలో చంద్రబాబును కలిసి సీటు కోసం ప్రయత్నించారు.

అయితే, దక్షిణం సీటుపై ఆశలు వదిలేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అవకాశం ఉంటే మాడుగుల నియోజకవర్గానికి పంపే అవకాశాన్ని పరిశీలిస్తానని మాత్రమే చెప్పినట్టు సమాచారం. అయితే, మాడుగుల నియోజకవర్గానికి వెళ్లనని ఆయన చంద్రబాబుకు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో గుమ్మనంగా బాబ్జీ సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.

చీపురుపల్లికి వెళ్లాల్సిందే..!

ఎన్నికలు జరిగిన ప్రతీసారి నియోజకవర్గాన్ని మార్చే అలవాటున్న గంటాకు... అదే తీరుతో గట్టి షాక్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకోసం ఏకంగా జిల్లానే మారుస్తూ చీపురుపల్లి నియోజకవర్గాన్ని గంటాకు చంద్రబాబు ఎంపిక చేశారు. గతంలో విశాఖ పర్యటన సందర్భంగా తనను



రాకుండా చేసినప్పటికీ గంటా కిమ్మనకపోవడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు... ఎన్నికల్లో గంటాకు షాక్ ఇచ్చేందుకు ఎప్పటి నుంచో వేచిచూస్తున్నారన్న అభిప్రాయం ఉంది. దీంతో ముందుగానే తమ మీడియాకు చీపురుపల్లికి గంటా అనే లీకులిచ్చింది. అయినప్పటికీ తనకు భీమిలి ఇవ్వాలని గంటా పట్టుబడుతుండగా... కుదరదని ఇప్పటికే చంద్రబాబు తేల్చిచెప్పారు. చివరి ఆశగా మరోసారి చంద్రబాబును గంటా కలిసి భీమిలి ఇవ్వాలంటూ వేడుకున్నట్టు తెలుస్తోంది.

అయితే చీపురుపల్లికి చలో అనాల్సిందేనని చివరాఖరి మాటగా బాబు స్పష్టం చేశారు. దీంతో ఏమీ చేయాలో పాలుపోక ఊసూరోమని గంటా ఉన్నట్టు తెలుస్తోంది. చీపురుపల్లికి వెళ్లి ఓడిపోవాలా? కిమ్మనకుండా పోటీ చేయకుండా గౌరవాన్ని కాపాడుకోవాలా అనే మీమాంసలో పడినట్టు సమాచారం. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో రేగిన అసంతృప్తికి చంద్రబాబు ఎటువంటి మందు పూయకపోగా మరింత రెచ్చగొట్టినట్టే వ్యవహారశైలి ఉందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

అనకాపల్లి... గోవిందా!

అనకాపల్లి నియోజకవర్గంలో చాలా రోజుల నుంచీ పార్టీ కోసం పీలా గోవింద్ పనిచేస్తున్నారు. తన సీటుకు వచ్చిన ఇబ్బందేమీ లేదన్న ధీమాతో ఉన్న పీలాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. తొలి విడత జాబితాలోనే అనకాపల్లి సీటు జనసేన నుంచి కొణతాల రామకృష్ణకు ప్రకటించడంతో పీలాకు గట్టి షాక్ తగిలినట్లు అయింది. దీనిపై ఆయన అనుచరులు పార్టీ తీరుపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పీలాకు ఇవ్వకపోతే ఎవరికీ సహకరించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. దీంతో పీలాను చల్లబరించేందుకు చంద్రబాబు కబురుపంపారు. అనకాపల్లి సీటును జనసేనకు ఇచ్చేశామని.. రాబోయే రోజుల్లో మంచి చేస్తామనే ఊరడింపుడు మాటలు చంద్రబాబు మాట్లాడినట్టు తెలుస్తోంది. దీంతో ఏమీ మాట్లాడకుండానే పీలా గోవింద్ వెనుదిరిగినట్టు సమాచారం. ఇదే విషయాన్ని ఆయన అనుచరుల వద్ద చెప్పగా.. తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని వారు మాట్లాడినట్టు తెలుస్తోంది. మొత్తంగా అధినేతతో జరిగిన సమావేశం పీలాకు ఎటువంటి ఊరడింపు దక్కకపోగా మరింత రెచ్చగొట్టినట్టు అయ్యిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారోననే చర్చ సాగుతోంది.

కొణతాలకు సీటు ఇస్తున్నట్టు చెప్పని పవన్

- కంటతడి పెట్టిన పరుచూరి భాస్కరరావు



జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పరుచూరి భాస్కరరావు

తుమ్మపాల: నమ్ముకున్న వారందరూ తనను వదిలేస్తున్నారని, జనసేన,టీడీపీ పొత్తులో కొణతాల రామకృష్ణకు సీటు ఇస్తున్నట్టు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పకపోవడం ఎంతో బాధించిందని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమ్మ కులంలో పుట్టడమే తనకు సీటు రాకపోవడానికి కారణమని కంటతడి పెట్టారు. పార్టీ కోసం గ్రామగ్రామాన తిరిగి పనిచేశానని చెప్పారు. 24 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సేవలు అందిస్తున్నానని తెలిపారు. కానీ నాకు అవకాశం ఇవ్వకపోవడం నిరాశకు గురిచేసిందని చెప్పారు. తన వయస్సు 60 ఏళ్లపైనేనని, ఇక అవకాశం లేకపోవచ్చు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటాడిన మృత్యువు

- డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- పురుషోత్తపురం వద్ద ఒడిశా వాసి దుర్మరణం

8లో

క్లుప్తంగా

విద్యార్థులకు వరం విద్యారుణం


స్టేట్ బ్యాంకు విద్యా రుణం గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ

తుమ్మపాల : ఉన్నతవిద్య కోసం బ్యాంకులు ఇచ్చే విద్యారుణం విద్యార్థులకు వరమని కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన భారతీయ రిజర్వ్ బ్యాంకు విద్యారుణాల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత, అవసరం ఉన్న విద్యార్థినీవిద్యార్థులు తమకు కేవలం బ్యాంకు ఖాతా ఉన్నట్టయితే విద్యారుణం పొందవచ్చన్నారు. రూ.4 లక్షల వరకు తీసుకునే రుణానికి ఎటువంటి తాకట్టు అవసరం లేదన్నారు. కోర్సు పూర్తయిన ఒక ఏడాది తరువాత తిరిగి చెల్లింపులు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ పాల్గొన్నారు.

యాదవులకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న వెంగళరావుయాదవ్

అనకాపల్లి: జిల్లాలో యాదవులకు సరైన న్యాయకత్వం లేకుండా పోయిందని, రెండు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు ఇవ్వాలని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. వెంగళరావుయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని విజయ రెసిడెన్సీలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో యాదవులకు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు రాజకీయ పార్టీలు ప్రకటించాలని కోరారు. సీట్లు ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. యాదవ అభ్యర్థులకు జిల్లా కులస్తులు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు భర్నికాన సాయినాథ్, గౌరవాధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వియ్యపు సింహాచలం పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీలకు సత్వర పరిష్కారం


స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: స్పందనలో వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను మరింత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిప్పి పంపే దరఖాస్తులు, ఫిర్యాదులపై తిరస్కరణ గూర్చి వివరంగా తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌వో బి.దయానిధి, డీఎల్‌డీవో మంజులవాణి, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజులు 336 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, బీజేఆర్ సుజల స్రవంతి ఎస్‌డీసీ కె.రమామణి, డీటీవో లక్ష్మి సుహాసిని, సీపీవో జి.రామారావు, విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, పీఆర్ ఈఈ వీరునాయుడు, డీఎస్‌వో కె.వి.ఎల్.ఎస్.మూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ, సంక్షేమ శాఖ డీడీలు కె.రాజేశ్వరి, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ రైతులకు స్థలాలు చూపించాలి

అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెంలో దళితుల సాగులో ఉన్న 25 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్‌లో 2019లో తీసుకొని ప్రత్యామ్నాయంగా ఎల్పీసీలు ఇచ్చినప్పటికీ స్థలాలు మాత్రం చూపించలేదని, తక్షణమే రైతులకు స్థలాలు చూపాలని డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు అర్జీ అందజేశారు.

- రోలుగుంట మండలం శరభవరం గ్రామం రాజన్నపేటకు చెందిన మహిళలకు రెండవ విడత ఆసరా నగదు జమ చేయాలని ఆ గ్రామస్తులు కోరారు.

రేషన్ కార్డు మంజూరు చేయాలి

తల్లిదండ్రుల రేషన్ కార్డు నుంచి తమను తొలగించి నూతనంగా రేషన్ కార్డు మంజూరు చేయాలని మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామానికి చెందిన నగిశెట్టి పవన్ కోరారు. గ్రామ వలంటీర్, సచివాలయంలో వినతి అందించినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

పోలీస్ ‘స్పందన’కు 22 అర్జీలు

అనకాపల్లి: చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 22 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో వచ్చిన ఫిర్యాదులపై ఆయా స్టేషన్ల అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్ఐ టి.దివ్య, అర్జీదారులు పాల్గొన్నారు.

- తన భర్త వెంకటస్వామి పేరు మీద ఉన్న భూమిని వేరే వ్యక్తి దొంగతనంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన మళ్ల సత్యవతి ఎస్పీకి అర్జీ అందజేశారు. ఏటికొప్పాకలో నివసిస్తున్న మాకు యలమంచిలిలో 2.01 ఎకరాల భూమి ఉందని, 2022 అక్టోబర్ 29న మా భూమిని ఆన్‌లైన్‌లో గడపా కొండయ్యనాయుడు అనే వ్యక్తి దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

ఘనంగా పుష్పాంజలిసేవ

- ముగిసిన 751వ శ్రీ కేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు


ఊయలలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవస్వామివారు

చోడవరం: శ్రీ కేశవస్వామివారి పుష్పాంజలి సేవను సోమవారం కనులపండువగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారి ఊంజల సేవలో పాల్గొని తరించారు. ఉత్తరాంధ్రలో ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ కేశవస్వామివారి 751వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈనెల 19న ఈ ఉత్సవాలు ప్రారంభమై, ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి పుష్పాంజలి సేవ కనుల పండువగా జరిగింది. శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణాన్ని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో శ్రీదేవి,భూదేవి, కేశవస్వామి ఉత్సవ మూర్తులను ఉంచి వేదపండితులు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో మంత్రోచ్చారణ మధ్య స్వామివారి ఊంజల సేవ నిర్వహించారు. మహిళలు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవస్వామివార్ల ఉత్సవ మూర్తులతో చోడవరం పురవీధుల్లో వైభవంగా తిరువీధోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అలమండ ఈశ్వరరావు, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

తాండవలో సినిమా షూటింగ్

నాతవరం: తాండవ రిజర్వాయరుపై సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కొత్తగా రూపొందించే సినిమాకు సంబంధించి పలు సన్నివేషాలు సోమవారం ఇక్కడ చిత్రీకరించారు. తాండవ ప్రాజెక్టు దిగువన నల్లకొండమ్మ తల్లి ఆలయం, తాండవ స్పిల్‌వే గేట్లు, నాతవరం – గొలుగొండ మండలాలను అనుసంధానం చేస్తూ కొండపై వేసిన ఘాట్ రోడ్డుపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

సినిమా పేరు వెల్లడించలేదు. అక్కడ షూటింగ్ దృశ్యాల ఫోటీలు తీసేందుకు అనుమతించలేదు. చుట్టు పక్కల గ్రామాల వారు చూసేందుకు ఎగబడ్డారు. వీరిని సినిమా యూనిట్ నియంత్రించడంతో దూరం నుంచే తిలకించారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, వైద్యాధికారులు

తుమ్మపాల: పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను తప్పనిసరిగా ప్రతిసారీ వేయించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారులతో కలిసి ‘ప్రతిసారీ రెండు చుక్కలు’ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3న పోలియో ఆదివారాన్ని పురస్కరించుకుని 0 నుంచి 5 ఏళ్ల మధ్య వయస్సు గల ప్రతి బిడ్డకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌వో బి.దయానిధి, డీఎల్ డీవో మంజులవాణి, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ ఎ.హేమంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కిషోర్ కుమార్, నర్సీపట్నం వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞావతి పాల్గొన్నారు.

బోదిగల్లం వద్ద అండర్ బ్రిడ్జి ప్రారంభం


పీఎల్‌పురంవద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఈ రవితేజ


పెదబోదిగల్లం వద్ద మాట్లాడుతున్న ఎస్‌సీ రైల్వే ఏపీఆర్‌వో శ్రీనాథ్


భీమవరం దార్లపూడి రైల్వే క్రాసింగ్ బ్రిడ్జి ప్రారంభంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ఎన్నడూ లేని విధంగా దేశంలో ఒకే విడతలో అధిక సంఖ్యలో రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఓవర్‌బ్రిడ్జిలు ప్రారంభోత్సవం చేసుకోవడం గర్వంగా ఉందని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఏపీఆర్‌వో శ్రీనాథ్ అన్నారు. పలు ప్రాంతాల్లో పూర్తిచేసిన అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో సోమవారం ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. మండలంలోని పెద బొదిగల్లం వద్ద నిర్మించి రైల్వే అండర్ బ్రిడ్జి(పాస్)ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీనాథ్ మాట్లాడుతూ అమృత భారత్‌కింద నర్సీపట్నం ఎన్‌హెచ్ 16 కలుపుతూ నిర్మించిన రోడ్ ఓవర్ బ్రిడ్జిని ప్రధానిమోడీ జాతికి అంకితం చేశారన్నారు. రైల్వే క్రాసింగ్‌ల స్థానంలో రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ అభివృద్ధిపనులకు సంబంధించిన షార్ట్‌ఫిల్మ్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అగ్రగామిగా ఎదగడానికి మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈసందర్భంగా పెద బోదిగల్లం హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్‌ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు రత్నకుమారి, మున్సీసా, నాగ అప్పలరాజు, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, ఎంఈవో కుంచం నరేష్, రైల్వే అధికారులు తాతారావు, సంతోష్, వర్మ, రమేష్, శ్రీనివాసరావు, రామకృష్ణ బీజేపీ నాయకులు కోసూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భీమవరం–దార్లపూడి అండర్ పాసింగ్ బ్రిడ్జి ..

ఎస్.రాయవరం: భీమవరం–దార్లపూడి గ్రామాల మధ్య రైల్వే లైను క్రాసింగ్ గేటు వద్ద నిర్మించిన అండర్ గ్రౌండ్ పాసింగ్ బ్రిడ్జిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత సి.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట మండలంలో..

పాయకరావుపేట : మండల పరిధిలో పీఎల్‌పురం, నామవరం గ్రామాల సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను రైల్వే అధికారులు ప్రారంభించారు. ఒక్కొక్కదానిని రూ. 7.5 కోట్లతో పూర్తి చేశారు. పీఎల్ పురం వద్ద నిర్మించిన అండర్ పాస్ ప్రారంభోత్సవానికి ఏడీఈ (విజయవాడ) రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తుని రైల్వే స్టేషన్ టీటీఈ ఎస్.ప్రకాష్, బీఎస్ఆర్ డి.రోజా, ఎస్ఎస్ఈ మస్తాన్‌వల్లీ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పీఎల్ పురం సర్పంచ్ పడాల సోమన్నదొర, స్థానిక బీజేపీ నాయకులు కోనే రంగయ్య, వేముల వెంకటరమణ పాల్గొన్నారు. నామవరం వద్ద అండర్ పాస్ బ్రిడ్జిని దక్షిణ మధ్య రైల్వే ఏపీవో శైలు సుధాకర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఉపసర్పంచ్ పల్లా బాబూరావు, ఎంపీడీవో కె.స్వప్న పాల్గొన్నారు. ప్రారంభోత్సవాలకి ముందుగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

వెంటాడిన మృత్యువు

- డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- పురుషోత్తపురం వద్ద ఒడిశా వాసి దుర్మరణం


ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనం


సివిల్ ఇంజినీర్ తరాయి జగన్నాథం మృతదేహం

యలమంచిలి: సకాలంలో డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ యువ ఇంజినీర్‌ను మృత్యువు వెంటాడింది. ఉపాధి నిమిత్తం ఒడిశాకు చెందిన తరాయి జగన్నాథం (26) తెలంగాణాలో మునగాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సోమవారం ఉదయం యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ గ్రామానికి చెందిన అతడు సివిల్ ఇంజినీర్‌గా మునగాడ వద్ద కేపీసీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామం వచ్చి తిరిగి డ్యూటీలో చేరేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదానికి గురైనట్టు యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలం తెలిపారు. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచామని, మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

అప్పుల బాధతో లారీడ్రైవరు ఆత్మహత్య


మృతుడు శ్రీను (ఫైల్)

నర్సీపట్నం: మండలంలో ధర్మసాగరానికి చెందిన గొంప శ్రీను(38) అప్పులబాధ తాళలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ ఎస్సై భీమరాజు సోమవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న శ్రీనుకు భార్య, పాప ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు వల్ల ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరలేదు. దాంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వాకబు చేశారు. ఈ క్రమంలో గ్రామ సమీప బావిలో శవమై తేలియాడటంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి గుర్తించి సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీ

- అన్నవరం వెళ్తున్న వ్యాన్ ఢీ
- ఐదుగురు భక్తులకు గాయాలు


ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

కశింకోట: అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి బయలుదేరిన ఐదుగురు భక్తులు గాయపడ్డారు. కశింకోట జాతీయ రహదారిపై సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు వివరాల ప్రకారం... అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అకస్మాత్తుగా ఆగడంతో వెనుక వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న శ్రీకాకుళానికి చెందిన సకలాభక్తుల రామచంద్రరావు, భార్య పావని, బంధువులు చక్రపాణి, భాగ్యరేఖ, డ్రైవర్ శ్రీనివాస్ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళం నుంచి అన్నవరం వెళుతుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జెడ్.కొత్తపట్నం ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ


ఉపకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లూసి

రావికమతం: మండలంలోని కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలోని జెడ్.కొత్తపట్నం ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం బృందం సోమవారం తనిఖీ చేసింది. బృందం సభ్యులు ముందుగా రికార్డులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొంత మంది రికార్డులు సరిగా పూర్తి చేయకపోవడంతో వారికి తగిన సూచనలిచ్చారు. ఈ టీమ్‌లో జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ లూసి ,డీపీహెచ్‌ఎన్‌వో నాగమణి, డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు ఉన్నారు. స్థానిక వైద్యాధికార్లు రజని,సురేఖ,విస్తరణాధికారి పి.రామారావు వారి వెంట ఉన్నారు.

గుంటూరు శ్రీను, పెద్ద ఈశ్వరరావులపై వైఎస్సార్‌సీపీ వేటు

బీచ్‌రోడ్డు: అనకాపల్లి జిల్లా పాయకరావు పేట నియోజకవర్గంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నాయకులు గుంటూరు శ్రీను, పెద్ద ఈశ్వరరావులను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు.

ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులుకు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు వేటు వేశారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

బాలుడిపై మృత్యు పంజా

- వడ్డాదిలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి మృతి
- మేడపై ఆడుకుంటుండగా ప్రమాదం

బుచ్చెయ్యపేట: మేడపై ఆడుకుంటున్న బాలుడి(11)పై హైటెన్షన్ విద్యుత్తు తీగలు మృత్యు పంజా విసిరాయి. పొట్టకూటి కోసం రాజస్థాన్ నుంచి వలస వచ్చిన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఘటన మండలంలోని వడ్డాది మేజర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన భార్యాభర్తలు జలంసింగ్, కైలాస్ పదేళ్ల క్రితం పొట్టకూటి కోసం వడ్డాది వలస వచ్చారు. ఇక్కడ నాల్గు రోడ్ల జంక్షన్‌లో విద్యుత్ సామగ్రి అమ్ముకుంటూ పక్కనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమారుడు యువరాజ్‌సింగ్, రెండో కుమారుడు జస్వాల్ సింగ్‌లను స్థానిక ప్రైవేటు స్కూల్లో ఐదు, నాల్గో తరగతి చదివిస్తున్నారు. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి రాత్రి మేడపై పెద్ద కుమారుడు ఆడుకుంటున్నాడు. మేడ మీద చేతికి అందినంత ఎత్తులో హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఇవి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు తీవ్ర అస్వస్థతకు గురైన యువరాజ్‌సింగ్‌ను చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న పెద్ద కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాద సమయంలో తండ్రి జలంసింగ్ రాజస్థాన్‌లో ఉన్నాడు. బాలుడు తల్లి, కుటుంబ సభ్యులు రాజస్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించడానికి మృతదేహాన్ని తరలించారు.

తురకలపూడిలో మహిళపై దాడి

- పుస్తెలతాడుతో ఉడాయించిన గుర్తుతెలియని వ్యక్తి

బుచ్చెయ్యపేట: మండలంలో తురకలపూడిలో గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళపై దాడి చేసి ఆమె మెడలో పుస్తెలతాడు లాక్కొని ఉడాయించాడు. గ్రామానికి చెందిన గంట్ల సత్యవతి తన ఇంటి బయట పనిచేస్తుండగా, అతడు ప్రహరీ దూకొచ్చి వెనక నుంచి ఆమె ముఖంపై ప్లాస్టిక్ కవరు కప్పేశాడు. మెడలో పుస్తెల తాడును లాక్కోవడానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. దీంతో అతను పిడిగుద్దులు గుద్దాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెనుగులాటలో పుస్తెలతాడు ముక్క చిన్నది ఆమె చేతిలో ఉండిపోగా, మిగిలినది ఎత్తుకుపోయాడు. నాలుగు తులాల పుస్తెలతాడు పోవడంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. రావికమతం ఇన్‌చార్జి ఎస్ఐ ధనుంజయ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి సంఘటన స్థలంతోపాటు గ్రామంలో ఆధారాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



కశింకోటలోని శివాలయంలో నిర్వహిస్తున్న అన్న సమారాధన

కశింకోట: కశింకోటలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామిని పూలతో అందంగా అలంకరించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం శివ సన్నిధి గ్రూపు తరపున పేదలు, భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో 28న జాబ్‌మేళా

అనకాపల్లి : రేబాక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఈనెల 28న మూడు కంపెనీలతో మినీ జాబ్‌మేళా ఉదయం 10 నుంచి 4 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసుకుని, 18 నుంచి 35 సంవత్సరాలు నిరుద్యోగులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల : జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం సర్పంచ్‌లు నిరసన తెలిపారు. 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243, 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలోని నిధులు, విధులు అధికారాలను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు బదలాయించి గ్రామ పంచాయతీ, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులను బలోపేతం చేయాలని, సర్పంచుల 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కలిసి తమ గోడును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు సీహెచ్. సుజాత, వైస్ ప్రెసిడెంట్ వై.వినోద్ రాజ్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
సోమవారం 9,134 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,670
మొదటి రకం	3,700	4,300
రెండో రకం	3,380	3,890
మూడోరకం	3,350	3,440

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
సుందరంమాస్టర్	: సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	: సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
నాగదీపం	: వెంకటేశ్వర
------	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జోరుగా జగనన్న గృహాల రిజిస్ట్రేషన్లు



సచివాలయంలో రిజిస్ట్రేషన్ పనులు పరిశీలిస్తున్న జెడ్పీ అయ్యప్పనాయుడు



11వ సచివాలయంలో జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ల దృశ్యం

- జోన్ పరిధిలో 5,425 మంది లబ్ధిదారులు
- నేటి వరకూ 4,125 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి

అనకాపల్లి : టీడీపీ ప్రభుత్వంలో గృహాలు లేని నిరుపేదలు కాళ్ల చెప్పులు అరిగిపోయినట్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జీవీఎంసీ జోన్ పరిధిలో 80, 81, 82, 83, 84 వార్డుల్లో గృహాలు లేని నిరుపేదలకు సెంట్ ప్రభుత్వ స్థలంలో గృహాలు నిర్మించి ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల్లో పెదవాడి సొంతింటి కలను నేరవేరుస్తామని చెప్పిన మాటా ప్రకారం అర్హులైన లబ్ధిదారులను వలంటీర్ వ్యవస్థ ద్వారా గురించి, సకాలంలో ప్రభుత్వ స్థలం ఇవ్వడమే కాకుండా గృహాలు నిర్మించి ఇవ్వడంతో పెదోడు సొంతింటి కల నెరవేరింది. జోన్ పరిధిలో 5425 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అనకాపల్లి మండలంలో మామిడిపాలెం గ్రామంలోను, కోడూరు గ్రామంలో సర్వే నంబర్ 1, 5, గొలగాం గ్రామంలో సర్వే నంబర్ 1,2,3లోను, సత్యనారాయణపురం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో ప్రభుత్వ సెంట్ స్థలంలో 5425 మందికి స్థలం కేటాయించి, గృహాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుంది. పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు ప్రభుత్వం కన్వేయన్స్ డీడీలు ఇవ్వడం జరుగుతుంది.

జగనన్న కాలనీల్లో రిజిస్ట్రేషన్ పనులు ముమ్మరం

జోన్ పరిధిలో అర్హులైన 5,425 మంది లబ్ధిదారులకు 27 సచివాలయాల్లో పట్టాల సంపూర్ణ హక్కును కలిగేందుకు రిజిస్ట్రేషన్ ప్రకియ వారంరోజుల క్రితం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేటి వరకూ జోన్ పరిధిలో సుమారుగా 4,125మంది పేరుమీద సర్వహక్కులు పొందే విధంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. మిగిలిన లబ్ధిదారులు త్వరితగతిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జగనన్న కాలనీల్లో నివసించే లబ్ధిదారులు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నందుకు ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది



కుటుంబ సమేతంగా వేల్పుల వీధిలో సుమారుగా 25 సంవత్సరాలుగా అద్దె గృహాల్లో నివసిస్తున్నాం. ప్రభుత్వాలు మారినప్పటికీ మాలాంటి పెదోడు సొంతింటి కల కలగానే మిగిలి పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ద్వారా లబ్ధిదారులను గుర్తించి మండలంలో కోడూరు సర్వే నంబర్ 1లో సెంట్ స్థలం ఇచ్చి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

–ఎం.సత్యవేణి, వేల్పులవీధి

ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం



అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తూ గృహాలు లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ స్థలం అందించడం శుభపరిణామం. రెండేళ్ల క్రితం మామిడిపాలెం గ్రామంలో జగనన్న కాలనీలో సెంట్ ప్రభుత్వ స్థలం ఇచ్చారు. రెండు రోజుల క్రితం అదే స్థలం సర్వహక్కులు పొందే విధంగా సచివాలయంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థలంపై మాకు పూర్తి హక్కు కల్పించిన సీఎంకు మా కుటుంబం కృతజ్ఞతలు తెలియచేస్తోంది.

–కామేశ్వరి, అనకాపల్లి

విజయదుర్గమ్మకు దొరైస్వామి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : హరిగిరిపై వెలసిన విజయ దుర్గమ్మ వారికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి రూ.లక్షా వేయి నూట పదహార్లు విరాళం సోమవారం అందజేశారు. దొరస్వామి తన సొంత నిధులతో ఈ విరాళాన్ని అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన దొరస్వామికి ఆలయ వర్గాలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మారిసెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, మారిసెట్టి వెంకట సీతారాం, శరగడం లక్ష్మీ జ్యోతిర్మయి ప్రసాద్, శరగడం అప్పలనాయుడు, పెంటకోట నాయుడు, వర, రాము పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్స వం సోమవారం ఘనంగా జరిగింది. అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారు నుంచి అయ్యప్పను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చెర్లోపాలెంలో నేడు పాదాల తల్లి అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని చెర్లోపాలెంలో మంగళవారం పాదాల తల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుండడంతో దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు రానున్నారు. ఇందుకు సంబంధించి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా ప్రతాప్



మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన బద్దెం ప్రతాప్ విశాఖపట్నం టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర టెలిఫోన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. బీజేపీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతాప్ శక్తివంచన లేకుండా కృషి చేశారు. ప్రతాప్ సేవలను గుర్తించిన పార్టీ టెలికాం అడ్వయిజరీ సభ్యునిగా గుర్తించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పదవికి న్యాయం చేస్తానని ప్రతాప్ తెలిపారు.

పాస్టర్లు ఐక్యంగా ఉండాలి

కశింకోట : మండలంలోని చర్చిల పాస్టర్లు అంతా ఐక్యంగా ఉండాలని నిర్ణయించారు. స్థానిక ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో మండల చర్చి పాస్టర్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఐక్యంగా ఉండి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. అనంతరం కశింకోట యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ పేరిట నూతనంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫెలోషిప్ అధ్యక్షునిగా రెవ కె.సన్నీ జేమ్స్(కశింకోట ఆంధ్ర కల్వరి సెంటనరీ బాప్టిస్టు చర్చి), ఉపాధ్యక్షునిగా ఆమోస్ (కశింకోట), కార్యదర్శిగా కె. జాన్‌బాబు(తేగాడ), సహాయ కార్యదర్శిగా పి. అబ్రహం (వెదురుపర్తి), కోశాధికారిగా బి.ఇసాక్, సహాయ కోశాధికారిగా బి. ఎఫినెట్ (కశింకోట), గౌరవాధ్యక్షులుగా రెవ సిహెచ్ ప్రకాష్(బయ్యవరం), ఎం. రాజబాబు(గొబ్బూరుపాలెం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రైస్తవ సంఘాలు, సేవకుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పేర్కొంది. ఫెలోషిప్ అధ్యక్షుడు సన్ని జేమ్స్ మాట్లాడుతూ మండలంలోని క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి అభ్యున్నతికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లిపాయ, టమాటా ధరలు కాస్త పెరిగాయి.కిలోకి రూ.10 పెరిగింది. ఉల్లిపాయ, టమాటా గత వారం రూ.20 ఉండగా ఈ వారం రూ.30కి పెరిగాయి. బంగాళాదుంప, క్యాబేజి రూ.30, వంకాయ, బీట్రూట్,క్యారెట్ రూ.40, బెండకాయ, బీరకాయ, కాకరకాయ, దొండకాయ రూ.60, బీన్స్, క్యాప్సికం, చిక్కుడుకాయ రూ.80 అమ్మకాలు సాగాయి.

లేటయినా... లేటెస్ట్‌గా సీసీరోడ్డు



ముందుగా వేసిన సాధారణ సీసీరోడ్డు

చోడవరం రూరల్: నియోజకవర్గంలో భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎస్)రోడ్డు దుస్థితిపై ఐదేళ్ల పాలనలో మీనమేషాలు లెక్కించిన టీడీపీ నేతలు ఇప్పుడు దాన్ని ఆయుధంగా చేసుకుని అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. వారి నోళ్లు మూయించేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా నిర్మిస్తోంది. జాతీయ అభివృద్ధి బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులతో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి బీఎస్‌రోడ్డు నిర్మాణాన్ని చేపడుతోంది.

ఇందులో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో తారు రోడ్డయితే తదుపరి వర్షాలు, ఆవాసాల నుంచి వచ్చే వాడుక నీరు కారణంగా తిరిగి మరమ్మతుల పాలయ్యే వీలున్నందున సిమెంట్ రోడ్డు, దానికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మించడానికి ప్రణాళిక రూపొందించింది. చోడవరం పట్టణంలో ఈ రీతిన 1,840 మీటర్ల పరిధిలో సీసీరోడ్డు నిర్మాణం చేయనున్నారు. పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ క్యాంపు కార్యాలయం వరకు 7 మీటర్ల వెడల్పున సిమెంట్ రోడ్డును 800 మీటర్ల మేర నిర్మిస్తారు. నర్సీపట్నం వైపున ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నర్సయ్యపేట దరి వంతెన వరకు 1,040 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డును సీసీ డ్రైనేజీలను నిర్మించడానికి ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఇప్పటికే తొలి విడతగా సాధారణ సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డుపై నిత్యం రాకపోకల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన కన్సల్టెంట్ సంస్థ డిజైన్ ప్రకారం పటిష్ట సీసీరోడ్డును నిర్మిస్తున్నారు. సిమెంట్ రోడ్డును ఒక అడుగు మందంతో ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు వేసవి రోజుల్లో వ్యాకోచ, సంకోచాలకు గురయ్యే వీలున్నందున దీన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి గాను అడ్డం వరుసలో పది ఎం.ఎం. నిలువు వరుసలో 20 ఎం.ఎం ఇనుప ఊచలను వాడుతున్నారు. ఇది భవిష్యత్‌లో రోడ్డుపై జరిగే వాహనాల రాకపోకల రద్దీని సైతం తట్టుకోగలదని ఇంజనీరింగ్ నిపుణుల అభిప్రాయం. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్నాయి. ముందుగా కొత్తూరు జంక్షన్‌లో ఒక వైపున మూడున్నర మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇది పూర్తయ్యాక పక్కగా మరో మూడున్నర మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మిస్తారు. బీఎస్ రోడ్డులో మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ నుంచి బుచ్చియ్యపేట మండలం వడ్డాది జంక్షన్ వరకు 10.2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ఈ రోడ్డు ఏడు మీటర్ల వెడల్పున నిర్మించనున్నారు. ఈ మధ్యలో కల్వర్టులు, వంతెనలను పూర్తి చేస్తారు. దీంతో బీఎస్ రోడ్డు కష్టాలు తీరినట్టే.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి: ప్రణాళిక బద్ధంగా చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌ఐ డి. నాగేంద్ర ఆకాంక్షించారు. ఎం. అలమండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దేవరాపల్లికి చెందిన బాలు రెడీమేడ్ బట్టల షాపు యజమానులు బాలు, సుప్రీమ్ పరీక్ష మెటీరియల్‌ను సమకూర్చారు. వీటి ఎస్‌ఐ, ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపాలు శ్రీను సోమవారం పంపిణీ చేశారు. కె.వి.రమణ మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియం విద్యా బోధనతో ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు కల్పించారన్నారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బత్తి శ్రీనివాస్ కుమార్, నాడు అప్పారావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

బుచ్చెయ్యపేట: జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు మంగళవారం బుచ్చెయ్యపేటలో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇక్కడ ఆంజనేయస్వామి తీర్థం మహోత్సవం సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.



అనకాపల్లి నియోజకవర్గ సిద్ధం సభలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన సిద్ధం సభకు విశేష రీతిలో జనం నుంచి స్పందన లభించింది. పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకుల కోలాహలంతో భారీ ర్యాలీగా సభ వద్దకు చేరుకోవడంతో అనకాపల్లిలో సందడి నెలకొంది.



పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తు ర్యాలీగా వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఆధునిక పరిజ్ఞానంతో చెరకులో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

అనకాపల్లి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులు ఉపయోగించడం ద్వారా చెరకులో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో విశాఖ ఆత్మావారి సౌజన్యంతో యువరైతులకు వారంరోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెరకు సాగులో ఒంటికన్ను ముచ్చెలును విత్తనంగా ఉపయోగించడం ద్వారా చెరకుసాగులో ఖర్చు తగ్గించు కోవడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మీ మాట్లాడుతూ చెరకులో ఆదునిక వంగడాలు, ఆదునిక పద్దతులను ఆచరించటం ద్వారా చెరకు రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. చెరకులో ఒంటికన్ను ముచ్చెలు, జంటచాళ్ల పద్ధతిలో అంతర పంటల సాగు, డ్రిప్ ఇరిగేషన్ విధానం, కలుపునివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా చెరకు 25శాతం అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కెవి.రమణమూర్తి, విశాలాక్షి , ఉమామహేశ్వరరావు, సీతారామలక్ష్మీ, చోడవరం చెరుకు కర్మాగారం పరిధిలోని 10మంది యువ చెరకు రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘాల నిరసన



నెహ్రూచౌక్ వద్ద కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి : మన వ్యవసాయానికి ఉరి తాళ్లగా మారిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని రైతు సంఘాల సమన్వయసమితి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల జిల్లా నాయకులు కర్రి అప్పారావు, కోన మోహన్‌రావు, గండి నాయుడుబాబు, శంకరరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా డబ్ల్యూహెచ్‌వోలో వెనుకబడిన దేశాలపై సంపన్న దేశాలు అమలు చేస్తున్న ఒప్పందాల వల్లనే భారతదేశంలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కార్మికులు, ఉద్యోగుల హక్కులు కాలరాయడానికి దోపిడీ పాలన ప్రభుత్వాలు తీవ్రం చేశాయన్నారు. కేంద్రం ప్రజా వ్యతిరేక వ్యవసాయ నల్ల చట్టాలను, విద్యుత్ సరవణ చట్టం, లేబర్‌కోడ్‌లను తీసుకురావడం జరిగిందని వారు పేర్కొన్నారు. తక్షణమే ఈ చట్టాలను రద్దు చేసే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతుసంఘాల నాయకులు సదాశివరావు, కోన మోహన్‌రావు, బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై అవగాహన



గంగాదేవిపేటలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేట పోలింగ్ కేంద్రంలో సోమవారం ఈవీఎంల్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ప్రజలకు ఈవీఎంలు అలాగే వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్‌ఐ కిషోర్ ఓటు వేసే విధానంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాతవరం డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్



డీటీ లక్ష్మయ్య

నాతవరం: ఎన్నికల బదిలీల్లో భాగంగా నాతవరం డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.సురేష్‌ను నియమించడంతో సోమవారం విధుల్లోకి చేరారు. ఆయన ఇంతవరకు దేవరాపల్లి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ సి.వి. చైన్లును నక్కపల్లి బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన డిప్యూటీ తహసీల్దార్‌ను ఆర్‌ఐ హరి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, మండల సర్వేయరు బాలరెడ్డి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగుల డీటీగా లక్ష్మయ్య

మాడుగుల: డిప్యూటీ తహసీల్దారుగా డి. లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. చోడవరం తహసీల్దారు కార్యాలయంలో డీటీగా పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీటీ సత్యనారాయణ చోడవరం బదిలీపై వెళ్లారు.

పూడిమడకలో జాతర సందడి



దుకాణాల వద్ద జనాల సందడి

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక వద్ద మాఘపౌర్ణమి జాతర సందడి కొనసాగుతోంది. పౌర్ణమి స్నానాలు ముగిసిన వారం రోజుల వరకూ తీరం వద్ద దుకాణాల సందడి ఉంటుంది. ఈమేరకు సోమవారం కూడా పూడిమడక తీరం వద్ద వస్తువుల మార్పిడి సంత కొనసాగింది. ఇది ఎన్నో దశాబ్దాల నుంచి కొనసాగుతున్న సంప్రదాయం కావడం విశేషం.

ఘనంగా రమా సత్యనారాయణస్వామి తీర్థం

కె.కోటపాడు: ఆనందపురంలో సోమవారం రమా సత్యనారాయణస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ వంటాకు అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

మాడుగుల రూరల్: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి కిల్లో మాలంనాయుడు కోరారు. సోమవారం కింతలి పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు కలిగిన 2,326 మందికి చుక్కలు మందు వేస్తామన్నారు. ఇందు కోసం 27 బూత్‌లు ఏర్పాటు, 108 మంది సిబ్బందిని నియమించామన్నారు.